బీమా పథకాలు వినియోగించుకోవాలి

భువనగిరి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి జన సంరక్షణ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే కోరారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలపై గ్రామ పంచాయతీల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంఎస్‌బీవై పథకం కింద 18 నుంచి 70ఏళ్ల మధ్య వయస్సున్న వారు ఏడాదికి రూ.20 ప్రీమియంతో, పీఎంజేజేబీవై పథకంలో 18 నుంచి 50ఏళ్ల మధ్య వారు రూ.436 వార్షిక ప్రీమియంతో ఈ బీమా పొందొచ్చని తెలిపారు. అన్ని రకాల మరణాలను కవర్ చేస్తుందని తెలిపారు. ఈ బీమా పథకాలను అన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాల నుంచి పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ, పశుసంవర్ధకశాఖ అధికారి కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి సునందరెడ్డి, బ్యాంకు, నాబార్డు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.


ప్రధానమంత్రి జన సంరక్షణ పథకాలపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే

నేడు సబ్‌కోర్టు ప్రారంభం

రామన్నపేట, న్యూస్‌టుడే: హైకోర్టు జడ్జిలు జస్టిస్ కూనూరు లక్ష్మణ్, జస్టిస్ జె.శ్రీదేవి రామన్నపేటలో శనివారం పర్యటించనున్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సబ్‌కోర్టును ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మజీద్ శుక్రవారం తెలిపారు.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

భువనగిరి: గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీజీఎస్పీ ఛైర్మన్ సూచించారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ హన్మంత్ కె.జెండగే మాట్లాడుతూ.. జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6,216 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన

భువనగిరి: మానసిక ఆందోళనలు, ఒత్తిడిలున్న వ్యక్తులను గుర్తించి వారికి సరైన సమయానికి చికిత్స అందించాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే సూచించారు. మానసిక ఆరోగ్య మాసోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలకు మానసిక ఆరోగ్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్.యశోద మాట్లాడుతూ వైద్యాధికారులు తమ పరిధిలోని మానసిక ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనీమియా ముక్త్ భారత్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు.

యాదాద్రి శివాలయంలో చండీ హోమం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిలోని శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు శివ, పార్వతులను కొలుస్తూ, నిత్యపూజలు చేపట్టి, స్ఫటిక రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకం జరిపారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఉప ఆలయాలలో గణపతి, సుబ్రమణ్యస్వామికి ఆరాధన నిర్వహించారు. ఆలయ యాగశాలలో చండీ హోమం క్రతువును శైవాగమ ఆచారంగా చేపట్టారు.

స్వర్ణ పుష్పాలతో అర్చన

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం నిత్యపూజలతో పాటు సంప్రదాయ కైంకర్యాలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. సూర్యోదయానికి ముందే సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలోని స్వయంభువులను మేల్కొల్పి హారతితో కొలిచారు. వేద పఠనం, మంత్రోచ్ఛారణల మధ్య గోవుపాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసీదళాలతో అర్చన చేపట్టారు. భక్తులకు దర్శనమిస్తూ అభయమిచ్చే శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శనమూర్తులను సువర్ణ పుష్పాలతో అర్చించారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను ఆరాధిస్తూ స్వర్ణ పుష్పాలతో అర్చన క్రతువుని కొనసాగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ కైంకర్యంలో భక్తులు పలువురు పాల్గొని ఆశీస్సులు పొందారు.

వినతిపత్రం అందజేత

చౌటుప్పల్: తమకు న్యాయం చేయాలని కోరుతూ..చౌటుప్పల్-భువనగిరి-గజ్వేల్ ప్రాంతీయ రింగు రోడ్డు ఉత్తర భాగం భూనిర్వాసితులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, భాజపా శాసనసభ పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణ, పాయల్ శంకర్‌కు శుక్రవారం హైదరాబాద్‌లో వినతిపత్రాలు అందజేశారు. ప్రాంతీయ రింగు రోడ్డును ఓఆర్ఆర్ నుంచి శాస్త్రీయంగా నలభై కిలోమీటర్ల దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 28 కిలోమీటర్ల దూరం నుంచే రింగు రోడ్డు నిర్మించినట్టయితే రైతులకు నష్టం జరుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పట్టాలు లేక.. కష్టాలు..!




వలిగొండ: అక్కంపల్లి సమీపంలో అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా టార్పాలిన్లు (పట్టాలు)

భువనగిరి-వలిగొండ, న్యూస్‌టుడే: ఏటేటా ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా.. ఆ మేరకు మౌలిక సదుపాయాల కల్పనలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. రైతులకు కనీసం మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా.. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా కొనుగోళ్లు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నా.. సదుపాయాలు కొరవడి ఆర్థికంగా రైతులు నష్టపోతున్నారు.

● పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ మౌలిక సదుపాయాలను సమకూర్చాల్సి ఉంది. మౌలిక సదుపాయాలను పూర్తిగా సమకూర్చడంలో ఆ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మౌలిక సదుపాయాలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పౌర సరఫరాల సంస్థ ప్రతి సీజన్‌లో ఆయా జిల్లాల మార్కెటింగ్ శాఖకు రూ.కోట్లలో మార్కెట్ రుసుము చెల్లిస్తున్నా.. కనీస సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టడం లేదు.

కోతలు ప్రారంభమై.. కేంద్రాలు తెరుస్తున్నా...

వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి చాలా చోట్ల చేతికి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక ప్రారంభమైంది. తేమ శాఖ అధికంగా ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబెట్టుకుంటున్నారు. కానీ టార్పాలిన్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం శుభ్రం చేసేందుకు ప్యాడీ క్లీనర్లు కూడా సరిగా లేవు. సరిగా పని చేయడం లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో జిల్లాలో 75 శాతం కూడా లేవు. ఇక ధాన్యం తూర్పారబట్టే యంత్రాలు ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. తూకం యంత్రాలు సరిపడా లేవు. నూతన ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం తగ్గించేందుకు డ్రయర్లును కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేస్తేనే రైతులకు సౌకర్యంగా ఉంటుంది.



టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుంటున్నాం:

బోడపట్ల నర్సిరెడ్డి, వ్యవసాయ రైతు, సంగెం, వలిగొండ మండలం



కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు సరఫరా చేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద అద్దెకు తెచ్చుకోవాల్సి వస్తోంది. వర్షాలకు ధాన్యం తడిసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం సరఫరా చేయాలి. పదిహేను రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి.

ఇండెంట్ పెట్టాం:

సబిత, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, యాదాద్రి భువనగిరి

వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు కావాల్సిన యంత్రాలకు సంబంధించి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ఇండెంట్ పెట్టాం. టార్పాలిన్లు తక్కువగా ఉన్నా.. తెరిచిన కొనుగోలు కేంద్రాలకు ఇస్తున్నాం. ప్యాడీ క్లీనర్లు చాలా వరకు బాగానే ఉన్నాయి. 1,255 టార్పాలిన్లు, 365 విన్నోయింగ్ యంత్రాలు, 142 ప్యాడీ క్లీనర్లు, 170 తూకం యంత్రాలు అవసరమని లేఖ రాశాం.



మార్కెటింగ్ సమకూర్చాల్సిన సదుపాయాలు

జిల్లా	టార్పాలిను			ప్యాడీ క్లీనర్లు			తూకం మిషన్లు		
	అవసరం	ఉన్నవి	కావాల్సినవి	అవసరం	ఉన్నవి	కావాల్సినవి	అవసరం	ఉన్నవి	కావాల్సినవి
నల్గొండ	6500	6000	500	354	325	29	2000	1950	50
సూర్యాపేట	5500	5000	500	350	310	40	350	310	40
యాదాద్రి	4,845	3,567	1255	369	228	142	646	476	170

ఓటర్ల పెంపునకు కసరత్తు

ఉమ్మడి వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీకాలం ముగుస్తుండటంతో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించింది. గత నెల 30 నుంచి నవంబరు 6 వరకు ఓటు నమోదుకు గడువు ఉండగా.. ఇప్పటికే సంబంధిత ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూతన ఓటర్ల నమోదుపై దృష్టి సారించారు. ప్రత్యేకంగా సర్వీస్ కేంద్రాలు ఏర్పాటుచేసి ఓటు నమోదుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో ఓటుహక్కు ఉన్న వారు సైతం తిరిగి నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దిశగా ఓటరు జాబితా రూపకల్పనకు ఏర్పాట్లు చేపట్టాలని సూచిస్తున్నారు.

దరఖాస్తు ఇలా..

ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఫారం-19 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంది. ధ్రువపత్రాలతోపాటు అదనంగా గత ఆరేళ్ల నుంచి ఎక్కడ బోధిస్తున్నారనే వివరాలు పేర్కొనాలి. అందుకు సంబంధించి ధ్రువపత్రాలు సైతం జత చేయాల్సి ఉంది. పూరించిన దరఖాస్తులను జిల్లాలోని సంబంధిత ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల్లో అందజేయాలి. ఆన్‌లైన్‌లో ceo.telangana వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉపాధ్యాయ సంఘాల దృష్టి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2019 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 7,243 మంది ఉన్నారు. దాదాపు 12 వేల మందికిపైనే ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులుండగా తక్కువ మంది ఓటు నమోదు చేసుకున్నారు. ఈ సారి ఓటర్ల సంఖ్య పెంచడానికి జిల్లా యంత్రాంగంతోపాటు ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా ఓటు నమోదుకు సర్వీస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరో 17 రోజులు మాత్రమే నమోదుకు అవకాశం ఉండటంతో ముమ్మరంగా అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2019లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు

జిల్లా	ఓటర్లు
నల్గొండ	3,859
సూర్యాపేట	2,156
యాదాద్రి	1228

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే

కమ్ముకొచ్చిన కారుమేఘం.. దృశ్యం అమోఘం..!



గుట్టలను తన గుప్పెట్లో బంధించి.. నేలను తాకాలనే కుతూహలంతో కమ్ముకొచ్చిన కారు మేఘాలు శుక్రవారం యాదగిరిగుట్టలో చూపరులకు కనువిందు గొల్పాయి..ఈ దృశ్యాన్ని చూసిన ప్రకృతి ప్రేమికులు ఆనందంలో మునిగిపోయారు..యాదాద్రికి వచ్చిన భక్తులు కెమెరాల్లో బంధించారు. యాదాద్రి గండిచెరువు వద్ద కన్పించిన దృశ్యమిది. – న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట పట్టణం

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ

ఏఈ పీఆర్‌కు తాఖీదు ఇవ్వాలని ఆదేశం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: అనధికారికంగా విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు తాఖీదు (మెమో)లు జారీ చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శోభారాణి ఆదేశించారు. చౌటుప్పల్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయ ఉద్యోగుల హాజరు నమోదు దస్త్రాన్ని పరిశీలించారు. పంచాయత్‌రాజ్ శాఖ ఏఈ నితీశ్‌కుమార్ తన పర్యటన వివరాలు నమోదు చేయకుండా అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారని గుర్తించి అతనికి తాఖీదు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవో యాకూబ్‌నాయక్, ఎంపీవో అంజిరెడ్డి, సీనియర్ సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.


చౌటుప్పల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జడ్పీ సీఈవో శోభారాణి

పకడ్బందీగా నిత్యాన్నప్రసాదం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: దాతల సహకారంతో కొనసాగిస్తున్న నిత్యాన్న ప్రసాదం దుర్వినియోగం కాకుండా భక్తులకు మాత్రమే చేకూరేలా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పకడ్బందీ చర్యల అమలుకు యోచిస్తోంది. క్షేత్ర సందర్శన కోసం వచ్చే భక్తులకు స్వామి అన్న ప్రసాదాన్ని ప్రాప్తింప జేసేందుకు సరికొత్త విధానాన్ని అమలు చేయాలని ఈవో భాస్కరరావు ఆలోచన. ప్రధాన ఆలయంలో నిత్యం ఉదయం దైవ దర్శనం చేసుకునే భక్తుల చేతికి డిజిటల్ వంటి కంకణం వేయడంతో అన్న ప్రసాదాన్ని అందించే ప్రాంతాన్ని కనుగొనే అవకాశం కలుగుతుంది. దీంతో లక్ష్యం నెరవేరుతుందని ఆలయ నిర్వాహకుల భావన.


నిర్మితమవుతున్న అన్న ప్రసాద వితరణ భవనం


అంచెలంచెలుగా సంఖ్య పెంపు

యాదగిరీశుడి మహాదివ్య క్షేత్రంలో పేదల ఆకల్ని తీర్చే స్వామి నిత్యాన్న ప్రసాదం వెయ్యి మందికి అందించేలా మున్నేళ్ల క్రితం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నడుంబిగించింది. 600 మంది భక్తులకు చేకూర్చే నిత్యాన్న ప్రసాదం మరో నాలుగొందల మంది భక్తులకు పెంచడం విశేషమే. దాతల విరాళాల ద్వారా కొనసాగుతున్న స్వామి అన్న ప్రసాదం పథకం మొదలై, గత ఆగస్టు 21 నాటికి 37 ఏళ్లు పూర్తయ్యాయి. నాటి నుంచి దాతల ద్వారా రూ.23 కోట్లకు పైగా జమయ్యాయని అధికారులు తెలిపారు.

★ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 1987 ఆగస్టు 21న నిత్యాన్నప్రసాదం పథకాన్ని ప్రవేశపెట్టి అప్పట్లో 50 మంది భక్తులకు సదరు సదుపాయాన్ని కల్పించారు. 1995లో వంద మందికి, 2001లో రెండొందలు, 2012లో 500 మందికి, 2023 ఆగస్టు, 1 నుంచి 600 మంది భక్తులకు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్న దేవస్థానం , ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రావిర్భావ దినోత్సవం రోజు (జూన్ 2) నుంచి 400 మందికి పెంచుతూ, వెయ్యి మంది భక్తులకు చేకూర్చడం అభినందనీయం. క్షేత్రాభివృద్ధికి పూర్వం అన్న ప్రసాదం కొండపైనే కొనసాగేది. ప్రస్తుతం కొండ కింద ఆధ్యాత్మిక వాడలో ఆ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. క్షేత్ర స్థాయికి అనుగుణంగా భక్తులకు అన్నప్రసాదం అందించాలని, వంటకాల విషయంలో ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ ఈవో ఆ విభాగం బాధ్యులకు సూచిస్తున్నారు.

సమగ్ర కుల గణనకు సన్నాహాలు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమగ్ర సామాజికవర్గ(కుల) గణనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితో పాటు సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అంచనాకు వచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



అన్నింటికీ అవసరమే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కుల గణనకు హామీ ఇచ్చింది. ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అభ్యంతరాలు వస్తున్నాయి. ప్రధానంగా బీసీ గణన చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. గతంతో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. కుల గణన చేస్తే పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. త్వరలో నిర్వహించే సర్పంచి, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు ఇది ప్రామాణికం కానుంది.

సిబ్బంది నియామకానికి కసరత్తు

ఇంటింటి సర్వే చేసేందుకు సిబ్బంది (ఎన్యుమరేటర్లు) ఎంత మంది అవసరమో అంచనా వేస్తున్నారు. 60 రోజుల్లో గణన పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల్లో పనిచేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే ఎన్యుమరేటర్ల నియామకం పూర్తి చేయనున్నట్లు ప్రణాళిక అధికారులు పేర్కొంటున్నారు.

బీసీలను లెక్కించలేదు

ప్రతి పదేళ్లకోసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు ఇతర సందర్భాల్లో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల గణన చేపట్టలేదు. ఇది బీసీ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. 2011 జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా గుర్తించారు. బీసీల గణాంకాలు బయట పెట్టలేదు. నాటి నుంచి బీసీ సంఘాల నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉన్నత న్యాయ స్థానం సైతం బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

గమ్మత్తులో యువత..!





ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024లో మిషన్ పరివర్తన్ కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చిన వారి సంఖ్య: 327

ఇందులో గంజాయి తాగటం మానేసిన వారి సంఖ్య: 321

డీఅడిక్షన్ కేంద్రంలో ఉన్నవారి సంఖ్య: 6

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల ధన, మాన, ప్రాణాలను కబళించే కర్కశులను నియంత్రిస్తూ.. జనజీవన భద్రతను కంటికిరెప్పలా కాపాడాల్సిన బాధ్యత, పాలకులు, అధికారులపై ఉన్నదన్నది ఎంత సత్యమో.. అదే సమయంలో వారి పిల్లల ప్రవర్తనను, పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందనే విషయాన్ని గ్రహించాలి. అప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని ప్రముఖులు, నిపుణులు అవగాహన కల్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో లోపం కనిపిస్తోందని చెప్పొచ్చు.


☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గంజాయి చాపకింద నీరులా విస్తరిస్తోంది. దాని వాడకం యువతతో పాటు మైనర్లకు పాకుతోంది. దీనికి అలవాటు పడి కొందరు యువకులు, మైనర్లు ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. సరిహద్దు, కృష్ణపట్టె పరివాహక ప్రాంతం నుంచి గ్రామాలకు, పట్టణాలకు విస్తృతంగా సరఫరా అవుతోంది. పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ పూర్తిగా నిరోధించలేకపోతున్నారు. గంజాయి వాడకాన్ని తగ్గించాలంటే తమతోపాటు(పోలీసులు) తల్లిదండ్రుల పాత్ర కీలకమని వారు చెబుతున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు..

☛ మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదివే బాలుడు వాళ్ల తరగతి ఉపాధ్యాయురాలితో 'నా మిత్రుడి ఇంట్లో గంజాయి ఉందట.. నన్ను రమ్మని పిలుస్తున్నాడు' అని చెప్పటంతో ఆ ఉపాధ్యాయురాలికి నోట మాట రాలేదు.

☛ రెండు నెలల క్రితం పట్టణంలోని రవీందర్‌నగర్‌లో పని చేసే ఓ మైనర్ వింత ప్రవర్తనతో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేశాడు. మైనర్ ఆగడాలను తట్టుకోలేక.. ఆ తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మైనర్‌ను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులకు, ఆత్మహత్య చేసుకుంటానని చాకుతో చేతిని కోసుకుని దగ్గరకు రాకుండా బెదిరించాడు. దీంతో మైనర్‌ను పోలీసులు పట్టుకుని వైద్య పరీక్షలు నిర్వహించగా.. గంజాయి తీసుకున్నట్లు తేలటంతో డీఅడిక్షన్ కేంద్రానికి పంపారు.

☛ సూర్యాపేట జిల్లా కేంద్రంలో గంజాయి మత్తులో కొందరు, ఓ యువకుడిని చావగొడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరలైంది. ఇలాంటి వెలుగులోకి రాని ఘటనలు కోకొల్లలు.



విచక్షణాజ్ఞానం కోల్పోతారు..

డాక్టరు మోయినుద్దీన్, మండల వైద్యాధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మిర్యాలగూడ



గంజాయికి అలవాటు పడితే వారిలో ఏకాగ్రత లోపిస్తుంది. రెండు, మూడేళ్లుగా వరుసగా తీసుకుంటే విచక్షణాజ్ఞానం కోల్పోతారు.. సైకోయిజం లక్షణాలు వస్తుంటాయి.



అవగాహన కల్పిస్తున్న రెండో పట్టణ వలయాధికారి నాగార్జున



అవగాహన కల్పిస్తున్నాం.. వీరబాబు, సీఐ, మిర్యాలగూడ గ్రామీణం

ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజలకు, అనుమానం వచ్చిన పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడికక్కడ నిఘా బృందాలతో తనిఖీ చేస్తున్నాం. ప్రజలంతా సహకరిస్తే వాడకాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం.

అతడు.. నిజంగా వీరుడే..!



వీరబాబు

కోదాడ, న్యూస్‌టుడే: చదువుకున్న యువకుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించాడంటే అతడి వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. అంతకు మించితే 40 లోపు ఉద్యోగం సాధిస్తుంటారు. అదే 40 దాటి ఉద్యోగం సాధిస్తే ఆశ్చర్య పడాల్సిందే. ఏకంగా 47 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు కోదాడకు చెందిన గూటి వీరబాబు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో సోషల్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి ఔరా అనిపించారు.

పది తప్పి.. పశువులు మేపి..

పదో తరగతి ఫెయిల్ కావడంతో ఏడాది పాటు పశువులు, మేకలు మేపారు. ఇంటర్ అతి కష్టం మీద పాసయ్యాడు. అనంతరం డిగ్రీ, బీఈడీ చదివారు. అనంతరం వివాహం, ఇద్దరు పిల్లలతో జీవనం గడపడం కష్టంగా మారింది. ఫొటోగ్రాఫర్‌గా పని చేసినా.. ప్రయోజనం లేదని తెలుసుకున్నాడు. ప్రభుత్వ కొలువు సాధిస్తేనే ఆ చదువుకు సార్థకత ఉంటుందని నమ్మి సాధన చేయడం మొదలుపెట్టారు.

★ గత 20 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడుతున్నారు. డీఎస్సీ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, గ్రూప్ ఉద్యోగాలు, రైల్వే, హాస్టల్ వార్డెన్ ఇలా 23 ఉద్యోగ పరీక్షలు రాశాడు. ఓ డీఎస్సీలో ఒక్క మార్కుతో ఉద్యోగం కోల్పోయారు. తాజా నోటిఫికేషన్‌లో ఏకంగా 4వ ర్యాంకు సాధించి ఆశ్చర్యపరిచారు. ఒక పూట ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ, మరో పూట పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయానికి వెళ్లి చదువును కొనసాగించారు. వయసు మీరినా ఉద్యోగం సాధించడంతో అందరికీ ఆదర్శంగా మారారు.

★ సరైనా ఉద్యోగం లేక, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గత పదేళ్లుగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడ్డానని వీరబాబు తెలిపారు. సోదరుడు 2006లోనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడంతో ప్రభుత్వ ఉద్యోగంపై మక్కువ పెరిగిందని, తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యుల సహకారంతో ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు.

★ వీరబాబు స్వగ్రామం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి అయినప్పటికీ గత 20 ఏళ్లుగా కోదాడ పట్టణంలో నివసిస్తున్నారు. పండగలకు స్వగ్రామానికి వెళితే ఏం చేస్తున్నావని, పదో తరగతి ఫెయిల్ అయిన వాడికి ఉద్యోగం ఎలా వస్తుందని, ఇంకా చదువు ఏంటనీ బంధువులు, స్నేహితులు హేళన చేసేవారని ఆయన చెప్పారు. దీంతో గ్రామానికి వెళ్లడం కూడా మానేశానని వివరించారు. ఇంటి అద్దె, పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సి వచ్చేదని, కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతోనే ఉద్యోగ కల నెరవేరిందన్నారు. గతంలో మాట్లాడటానికే చులకనగా చూసిన బంధువులు, స్నేహితులు ఇప్పుడు ఫోన్లు చేసి అభినందించడం ఆనందంగా ఉందని తెలిపారు.

పాత వీసీకే... పట్టం



ప్రొ.అల్తాఫ్ హుస్సేన్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నూతన వీసీగా ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో 2016 నుంచి 2019 వరకు ఇదే వర్సిటీకి వీసీగా పనిచేశారు. వర్సిటీలో రెండు పర్యాయాలు స్నాతకోత్సవం నిర్వహించిన ఘనత సైతం ఈయనకే దక్కింది. వర్సిటీకి ఇప్పటి వరకు ప్రొ.గంగాధర్, ప్రొ.కట్టా నర్సింహారెడ్డి, ప్రొ.అల్తాఫ్ హుస్సేన్, ప్రొ.గోపాల్‌రెడ్డి రెగ్యులర్ వీసీలుగా పని చేశారు. ఎంజీయూ వీసీ పోస్టు కోసం ఎంతో మంది ఆశావహులు పోటీ పడ్డా.. చివరికి అల్తాఫ్ హుస్సేన్‌కే పదవి వరించింది. ఐదో వీసీగా ఈయన త్వరలోనే పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. వర్సిటీకి నూతన వీసీ రానున్న నేపథ్యంలో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారంతో పాటుగా వర్సిటీలో అభివృద్ధి మరింత వేగం అవుతుందని భావిస్తున్నారు. నూతన వీసీకి ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ టూ వీసీ కె.అంజిరెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.



నేటి చిత్రం

జలబంధం..

గడ్డిపూల అందం

హాలియా వద్ద ప్రవహిస్తున్న వరద కాలువలో గడ్డి ఏపుగా పెరిగింది.. అది కాలువ మొత్తం విస్తరించింది.. పైగా తెల్లటి గడ్డిపూలతో దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది.. ఈ గడ్డి మధ్యలో నుంచే నీటి ప్రవాహం సాగుతోంది.

- ఈనాడు, నల్గొండ



శిక్షణ పొందుతున్న యువత (పాతచిత్రం)

ఉపాధికి శిక్షణ..

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ బాటలు వేస్తూ వారిలో కొత్త వెలుగులు నింపుతోంది మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థ. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదవలేక, చదివిన చదువుకు ఉపాధి, ఉద్యోగాలు లేక నిరాశతో నిరుద్యోగులుగా మారిన యువతకు ఉపాధి మార్గం వేస్తోంది. స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలున్న కంప్యూటర్, ఎలక్ట్రిషియన్, సోలార్, టైలరింగ్, సెల్‌ఫోన్ మరమ్మతులు, ద్విచక్ర వాహనాల మరమ్మతులు వంటి పలు కోర్సుల్లో వసతి కల్పించి శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ అనంతరం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తూ కచ్చితమైన ఉద్యోగ అవకాశాలను సంస్థ కల్పిస్తోంది. ఇటీవల ద్విచక్ర వాహన మరమ్మతు కోర్సులో శిక్షణ పూర్తిచేసుకొని ఉద్యోగాలు చేస్తున్న యువత అభిప్రాయాలు వారి మాటల్లోనే.

సంస్థ ఉపాధి మార్గం చూపించింది



- ప్రణీత్, మెదక్

నేను డిప్లొమా మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాను. చదువుకు తగ్గట్టుగా సరైన ఉద్యోగం లభించలేదు. స్నేహితుల ద్వారా సంస్థ గురించి తెలుసుకున్నాను. ఆటోమొబైల్ మరమ్మతు కోర్సులో ప్రవేశం పొందాను. శిక్షణ అనంతరం సికింద్రాబాద్‌లోని రాం హోండా మోటర్స్‌లో ఉద్యోగం సాధించాను. నెలకు రూ. 14 వేల వేతనం పొందుతున్నాను.

ఉగ్యోగానికి తగ్గట్టుగా..



- నగేష్, వనపర్తి

నేను ఇంటర్ చదివాను. సంస్థలో స్వల్పకాలిక కోర్సులైనా ఉద్యోగానికి తగ్గట్టుగా అవసరమైన అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ద్విచక్ర వాహన మరమ్మతు కోర్సులో శిక్షణ పొందాను. సంస్థ చేపట్టిన ప్రాంగణ ఎంపికల్లో సుశీల్ టీవీఎస్ కూకట్‌పల్లిలో టెక్నీషియన్‌గా ఉద్యోగం సంపాదించాను. నెలకు రూ.13వేల వేతనం పొందుతున్నాను.

కచ్చితమైన ఉపాధి అందించడమే లక్ష్యం



- అయోధ్య, శిక్షకుడు ఎస్ఆర్టీఆర్ఐ

ఉన్నత చదువులు చదువుకోలేక పోయిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలున్న కోర్సుల్లో శిక్షణ అందించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే సంస్థ లక్ష్యం. నిరుద్యోగ యువత ఖాళీగా సమయాన్ని వృథా చేయకుండా సంస్థ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలి.



కళావేదికపై నృత్య ప్రదర్శన

కళా వేదికపై కూచిపూడి నాట్యం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం నృత్య ప్రదర్శన జరిగింది. ఆధ్యాత్మిక ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే ఉద్దేశంతో దేవస్థానం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో హైదరాబాద్, హన్మకొండలకు చెందిన అర్చన నృత్యనికేతన్, హంపీ కళా నిలయం బృందాలు వేర్వేరుగా కూచిపూడి నాట్య ప్రదర్శనలు జరిగాయి.

వసూలు చేసి.. వదిలేసి..!

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పంచాయతీల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలపై సందిగ్ధత ఏర్పడింది. వీటి నిర్మాణాల కోసం నాలుగున్నరేళ్ల క్రితం ఒక్కో పంచాయతీ నుంచి రూ.20 వేలు డీడీలు తీసుకున్నారు. ఇప్పటి వరకు డబ్బులు తిరిగి ఇవ్వలేదు.

పంచాయతీలు చెల్లించిన డబ్బులు (రూ.లలో)

జిల్లా	పంచాయతీలు	చెల్లించిన డబ్బులు
నల్గొండ	844	1.68 కోట్లు
సూర్యాపేట	475	95 లక్షలు
యాదాద్రి	421	84.20 లక్షలు

సామూహిక మరుగుదొడ్లను మంజూరు చేస్తామని గతేడాది కేంద్రం ప్రకటించింది. దీంతో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు ఆ డబ్బులను తిరిగి చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం మరుగుదొడ్లను మంజూరు చేస్తుందా లేక పంచాయతీలకు డబ్బులు తిరిగి చెల్లిస్తుందా అనేది సందిగ్ధంగా మారింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రతి గ్రామంలో సామూహిక మరుగుదొడ్డి నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలు వాటాగా పదిశాతం చెల్లించాలని సూచించారు. 1740 పంచాయతీలు రూ.3.48 కోట్లు చెక్కులు, డీడీలు చెల్లించాయి. కొన్ని పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించి మధ్యలో నిలిపివేశారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఉపయోగకరం... పంచాయతీలు కట్టిన డబ్బులు గ్రామీణ అభివృద్ధి శాఖ వద్ద నాలుగున్నరేళ్లుగా ఉంటున్నాయి. ప్రస్తుతం పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో పంచాయతీలకు తిరిగి డబ్బులు చెల్లిస్తే పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఉపయోగపడుతాయి. సామూహిక మరుగుదొడ్ల పథకం ఇంకా ముగియలేదు. కేంద్రం మంజూరు చేస్తే వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తామని డీఆర్‌డీవో అధికారులు పేర్కొంటున్నారు.

నేర సంస్కృతికి విరుగుడు పుస్తక పఠనమే

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: నేర సంస్కృతికి విరుగుడు, సమాజం సమతౌల్యతను సాధించడానికి పుస్తక పఠనమే శక్తివంతమైందని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) పల్లె నాగేశ్వరరావు సూచించారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో శుక్రవారం ప్రముఖ కవి, రచయిత జూలూరు గౌరీశంకర్ రచించిన ఆత్మకథనాత్మక దీర్ఘ కావ్యం 'జూలూరు పథం' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 94 గ్రంథాలయాలకు ఈ గ్రంథాన్ని బహూకరించే కార్యక్రమం కోదాడలో ప్రారంభించినట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాణోతు బాలమ్మకు ఈ కావ్యం 200 గ్రంథాలను నాగేశ్వరరావు అందించి మాట్లాడారు. సమాజం విద్వేషాల నుంచి బైటపడి శాంతి వైపు పయనించాలంటే పుస్తకమే పదునైనా ఆయుధమన్నారు.



కోదాడలో 'జూలూరు పథం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు, నాయకులు

★ కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ మాట్లాడుతూ.. నడిగూడెం జమీందార్ నాయిన వెంకటరంగారావు 120 గ్రంథాలయాలను స్థాపించి, 60 గ్రంథాలను ముద్రించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. అదే మండలం నుంచి వచ్చిన జూలూరు ఉద్యమ సాహిత్యాన్ని వెలువరించారని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, చిన్ని, పార సీతయ్య, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, పాండురంగారావు, బంగారు నాగమణి, ఎస్ఆర్‌కేమూర్తి, దేవబత్తిని నాగార్జున, నాగిరెడ్డి, నాగేశ్వరరావు, రాంబాబు, శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు, రచయిత, కవులు పాల్గొన్నారు.

బీమా కంపెనీకి వినియోగదారుల కమిషన్ మొట్టికాయ

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: నామినీకి బీమా పాలసీ డబ్బులను చెల్లించడానికి తిరస్కరించిన ఓ బీమా సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయ వేసింది. పాలసీలో నామినీగా ఉన్న మృతుని కుమార్తెకు బీమా మొత్తాన్ని చెల్లించాలని శుక్రవారం ఆదేశాలను జారీ చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బీసీ కాలనీకి చెందిన వక్కంటి తిరుపతయ్య నల్గొండ జిల్లా కేంద్రానికి చెందిన ఓ బీమా సంస్థలో రూ.31,48,399లకు 36 నెలల కాలానికి పాలసీ తీసుకున్నారు. నామినీగా అతని కుమార్తె వక్కంటి రాజాచంద్రను నమోదు చేశాడు. 2021 మే 7న అనారోగ్యంతో తిరుపతయ్య మరణించారు. ఆయన ఇతర వ్యాధులతో ఉండి పాలసీలో చేరాడని.. డబ్బులు చెల్లించలేమని నామినీకి తెలిపారు. దీంతో బాధితురాలు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న కమిషన్ అధ్యక్షుడు మామిడి క్రిస్టోఫర్, సభ్యులు యస్. సంధ్యారాణి, కె.వెంకటేశ్వర్లు శుక్రవారం తుది తీర్పును వెలవరించారు. బాధితురాలికి మొత్తం రూ. 31,48,399లను 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించారు. సదరు మొత్తంతో పాటు ఫిర్యాదురాలిని మానసిక వేదనకు గురి చేసినందున నష్టపరిహారంగా రూ.లక్షను చెల్లించాలని, కేసు ఖర్చులు రూ.పదివేలను నేటి నుంచి 45 రోజుల్లో చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

చికెన్ ధరలు


ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

గాలికుంటు నివారణకు టీకాలు



నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గాలికుంటువ్యాధి నివారణకు పశువులకు టీకా వేయడం ప్రారంభించారు. టీకా కార్యక్రమం వచ్చే నెల 14 వరకు సాగుతుంది. నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో మూడు నెలల పైబడిన పశువులకు టీకాలు వేస్తారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాల్లోని పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి క్రిములు గాలితో ప్రయాణించి ఇతర పశువులకు సోకే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న ఎఫ్ఎండీ ప్రోగ్రామ్ కింద ఈ టీకాను ప్రతి ఆరు నెలలకు ఒక సారి వేసి, రాబోయే నాలుగేళ్లలో గాలికుంటు వ్యాధిని పూర్తిగా నివారించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

★ ఉమ్మడి జిల్లాలో 539406 పశువులు ఉన్నాయి. టీకాలు వేసిన పశువులకు గుర్తుగా కొమ్ములకు ఆకుపచ్చ రంగు వేస్తారు. ఉదయం వేళ చల్లటి సమయంలోనే టీకాలు వేసే కార్యక్రమం చేపడుతారు. అధికారులు గ్రామాలకు వెళ్లే ముందు రోజు పల్లెల్లో టాం టాం వేయించి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పశువైదులు, సిబ్బంది ప్రతి రైతు వద్దకు వెళ్లాల్సి ఉంది. అందుబాటులో రైతులు లేకపోతే మరో 10 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు.



రైతులు సద్వినియోగం చేసుకోవాలి:

జూలకంటి వెంకటరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి, నల్గొండ

అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగిస్తాం. గ్రామాల్లో పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

విద్యుత్తు టర్బైన్‌ను పరిశీలించిన జపాన్ నిపుణులు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ ప్రధాన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలోని టర్బైన్‌ను జపాన్‌కు చెందిన నిపుణులు పరిశీలించారు. సాగర్ ప్రధాన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలోని రెండో నంబరు యూనిట్ గతేడాది మరమ్మతులకు గురి కాగా.. జెన్‌కో అధికారులు మరమ్మతులు చేయడానికి పలుమార్లు ప్రయత్నం చేశారు. అది సఫలం కాకపోవడంతో ఆ యూనిట్‌లో విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇటీవల జెన్‌కో సీఎండీ సాగర్ విద్యుత్తు కేంద్రాలను సందర్శించి మరమ్మతులు చేయించడానికి తగిన చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో జెన్‌కో అధికారులు జపాన్‌కు చెందిన టర్బైన్ మరమ్మతుల నిపుణులను పిలిపించారు. శుక్రవారం విద్యుత్‌కేంద్రంలో మరమ్మతులకు గురైన యూనిట్‌ను వారు పరిశీలించారు. వెంటనే మరమ్మతులను ప్రారంభిస్తారని జెన్‌కో అధికారులు తెలిపారు.



కూరగాయల మేలెంచి..

పండ్లతోటలను తొలగించి

కూరగాయల ధరలు ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్నాయి. హైదరాబాద్ నగరంలో కొన్ని పేరున్న మాల్స్ వారు నేరుగా రైతుల వద్దకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి నగర వాసులకు విక్రయిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు రైతులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. నగర శివారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జూలూరు గ్రామానికి చెందిన కౌలు రైతు అంజయ్య ఏళ్లుగా పండిస్తున్న సపోటా తోటను తొలగించి నాలుగు ఎకరాల్లో అయిదారు రకాల కూరగాయలు పండిస్తున్నారు. టమాటా, దోస, మిర్చి, కాకర, బీర, బెండలను డ్రిప్ సాయంతో తక్కువ ఖర్చుతో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం టమాటా ధర అధికంగా ఉండటంతో ఎక్కువ సాగు చేస్తున్నారు. పండ్ల తోటతో పోలిస్తే కూరగాయల సాగు లాభదాయకంగా ఉందని రైతు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, బీబీనగర్

విద్యార్థులకు చదువే తపస్సు



చౌటుప్పల్‌లో విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న విద్యావేత్త, ఆంగ్లభాషా ప్రవీణ ఎమ్మెస్ కృష్ణమూర్తి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మనస్సు, మేధస్సు సమతుల్యతతో ఉంటే విద్య అని, విద్యార్థులకు చదువు తపస్సులాంటిదని విద్యావేత్త, ఆంగ్లభాషా ప్రవీణ ఎమ్మెస్ కృష్ణమూర్తి అన్నారు. చౌటుప్పల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978-79 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రతిభావంతులకు అభినందన పురస్కారోత్సవంలో ఆయన మాట్లాడారు. విజయమనే సోపానాన్ని జేబులో చేతులు పెట్టుకుని అధిరోహించలేమని, తగిన విధంగా సాధన చేస్తేనే సాధ్యమని విద్యార్థులకు ఉద్బోధించారు. ప్రతిభావంతులైన ముత్యాల పల్లవికి సిద్ధార్థ, కవ మంచి మానసవివేక శ్రీవిద్య, మరం భవానికి బదులు కమలమ్మ రామస్వామి పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు కర్నె శివకుమార్ అధ్యక్షత వహించారు. శ్రీరాములు, అంజాది ప్రమీల, అంజిరెడ్డి, చింతల కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, వెంకటేశ్వర కుమార్, యాదగిరిరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు



బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామంలో ఇళ్ల మధ్యలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. రక్షణ కంచె లేక పోవడంతో చాలా సార్లు ప్రమాదాలు జరిగాయి. వర్షాలు కురిసినప్పుడు, ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు విద్యుత్తు తీగలు అంటుకుని మంటలు వస్తున్నాయి. నియంత్రిక అక్కడి నుంచి తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నియంత్రిక మార్చివేస్తామని బొమ్మలరామారం విద్యుత్తు ఏఈ సాయిదీప్ వెల్లడించారు. – న్యూస్‌టుడే, బొమ్మలరామారం

అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది మోత్కూరు నుంచి గుండాల వెళ్లే రోడ్డు చెంత ఉన్న ఈ స్తంభం. దానికి నియంత్రిక కనిపించకుండా అల్లుకున్న తీగ. అసలే వర్షాకాలం.. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, మూగజీవాలు ఇలాంటి నియంత్రికలతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, అధికారులు వెంటనే అల్లుకున్న తీగను తొలగించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక విద్యుత్ ఏఈ హుస్సేన్‌ను వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని, ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే అల్లుకున్న తీగను తొలగించి రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, మోత్కూరు

సహాయకులకు అవగాహన

బీబీనగర్, న్యూస్‌టుడే: గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన శుక్రవారం హ్యాండ్ పంప్ విడిభాగాలు, హ్యాండ్ పంప్ రిపేర్‌పై నీటి పారుదల శాఖ అధికారులు అవగాహన కల్పించారు. బీబీనగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో హ్యాండ్ పంప్‌లో తరచూ తలెత్తే సమస్యలు, వాటిని ఎలా మరమ్మతు చేయాలనే దానిపై వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కరుణాకర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రశాంత్‌కుమార్, స్వాతి, రవి కిరణ్ పాల్గొన్నారు.

భువనగిరి గ్రామీణం: మంచినీటి నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో మంచినీటి సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మూడో రోజు పాల్గొని మాట్లాడారు. ఎంపీవో దినకర్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ గుండూరావు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన నీటి సహాయకుల మూడో రోజు జరిగిన శిక్షణలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కరుణాకర్ పాల్గొని ప్రసంగించారు. ఎంపీడీవో రాజ త్రివిక్రమ్, అధికారులు శిల్ప, శ్రీలత, గణేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ, అంకితభావం ఉండాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన ఉండాలని చౌటుప్పల్ మండల విద్యాధికారి గురువారావు అన్నారు. స్థానిక బంగారుగడ్డలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు దొంత స్వర్ణలత పదోన్నతిపై బదిలీ కావడంతో ఆమెను శాలువాతో శుక్రవారం సన్మానించి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు గంజి మారయ్య అధ్యక్షత వహించారు.



చౌటుప్పల్‌లో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈవో గురువారావు

ప్రతిభ చాటుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని డీఈవో సత్యనారాయణ అన్నారు. పట్టణ శివారులోని వెన్నెల కళాశాలలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కళా ఉత్సవం 2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, న్యాయనిర్ణేతలు, గైడ్ ఉపాధ్యాయులు రజని, రామారావు, ఉపేందర్‌రావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు.. జిల్లా స్థాయి కళా ఉత్సవంలో పాల్గొనేందుకు జిల్లాలోని 15 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డాన్స్, థియోటర్, విజువల్ ఆర్ట్స్ ఐదు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా అంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. వోకల్ మ్యూజిక్ అంశంలో సిరి (పదో తరగతి), టీజీఆర్ఎస్‌జేసీ చౌటుప్పల్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో ధ్రువ, (ఇంటర్ ప్రథమ), టీఎంఆర్ఎస్‌జేసీ, భువనగిరి, గ్రూప్ డాన్స్‌లో మాధురి, చార్మి, అనన్య, ఉమామహేశ్వరి, చంద్రిక, కేజీబీవీ, పోచంపల్లి, థియోటర్ అంశంలో శ్రీజ (పదో తరగతి), జడ్పీహెచ్ఎస్, బొమ్మలరామారం, విజువల్ ఆర్ట్స్‌లో సాయి కిరణ్(పదో తరగతి), జడ్పీహెచ్ఎస్ వెల్వర్తి విజేతలుగా నిలిచారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు.

రుణమాఫీ అమలు చేయడంలో విఫలం

రాజపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజా పాలన కాదని, ప్రజా కంటక పాలన కొనసాగుతుందని డీసీసీబీ మాజీ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. రాజపేటలోని ఓ ఫంక్షన్ హాలులో ఓ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా శుక్రవారం స్థానికంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వానాకాలం పంట కోత దశకు వచ్చినప్పటికీ రైతుబంధు వేసిన దాఖలాలు లేవన్నారు. ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. భారాస మండల అధ్యక్షుడు తిరుమలేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చామకూర గోపాల్ గౌడ్, నాయకులు వెంకట్రాంరెడ్డి, భాస్కర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, వీరేశం, హరినాథ్, నర్సింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

చెరువులన్నీ నింపుతాం

తుర్కపల్లి: ఆలేరు నియోజకవర్గంలో సాగు నీటి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. మండలంలోని మల్కాపురం, సంగ్యతండా, రాంపురంతండా తదితర ప్రాంతాల్లోని కాళేశ్వరం కాల్వలను శుక్రవారం ఆయన సందర్శించారు. గోదావరి జలాలతో చెరువులన్నీ నింపి పల్లెలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు శంకర్ నాయక్, భాస్కర్‌రెడ్డి, రఘు, నీటి పారుదల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిధుల విడుదల హర్షణీయం

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: బునాదిగాని కాల్వ నిర్మాణంలో భాగంగా అడ్డగూడూరు మండలంలో భూ నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం రూ.266.65 కోట్లు విడుదల చేయడం హర్షణీయమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు, మోత్కూరు, వలిగొండ, అడ్డగూడూరు మండలాల సీపీఐ మండల కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యు.ముత్యాలు, బి.సత్యనారాయణ, చేడె చంద్రయ్య, కె.హరిచంద్రు, సుదర్శన్, ఎం.వెంకటేశం, వెంకట్ పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందనలు

భువనగిరి, న్యూస్‌టుడే: మలేషియాలో జరిగిన 36వ ఇంటర్‌నేషనల్ ఓపెన్ మాస్టర్ ఛాంపియన్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన భువనగిరి పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్ కుమార్‌ను కలెక్టర్ హన్మంత్ కె.జెండగే అభినందించారు. ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన పోటీల్లో రెండో స్థానం సాధించి రజత పథకాన్ని సాధించారు. 1500 మీటర్ల పరుగు పందెం, 400 రిలే ఈవెంట్‌లో పాల్గొని 1500 మీటర్ల పరుగు పందెంలో ఆరో స్థానం, 400 రిలే ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచి అనిల్ కుమార్ రజత పథకాన్ని సాధించారు. ఆయన కలెక్టర్ హన్మంత్ కె.జెండగేను శుక్రవారం కలెక్టరేట్‌లో కలిశారు. పథకాలు సాధించిన అనిల్ కుమార్‌ను కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో యువజన, క్రీడల అధికారి ధనంజనేయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..!



విజ్ఞాన్ హైస్కూల్ విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న పాఠశాల ఛైర్మన్ పగిడాల జలేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ పగిడాల పురేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ అపర్ణ



విజ్ఞాన్ హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



దేదీప్య హైస్కూల్ విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ తుంగతుర్తి శేషగిరిరావు, డైరెక్టర్లు రంగారావు, యశోధర, వైస్ ప్రిన్సిపల్ రూప

భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్, దేదీప్య హైస్కూల్‌లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్‌కు చెందిన జి.సాత్విక (ఎనిమిదో తరగతి), ప్రథమ బహుమతి, సాత్విక్‌రెడ్డి (తొమ్మిదో తరగతి), ద్వితీయ బహుమతి, పి.శ్రీతన్‌రెడ్డి (తొమ్మిదో తరగతి), తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. దేదీప్య హైస్కూల్‌కు చెందిన వై.మనస్వీ (పదో తరగతి) ప్రథమ బహుమతి, ఎండీ.ముస్కాన్ (తొమ్మిదో తరగతి), ద్వితీయ, యూ.స్వాతి (పదో తరగతి), తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్ ఛైర్మన్ పగిడాల జలేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ పగిడాల పురేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ అపర్ణ, దేదీప్య హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ తుంగతుర్తి శేషగిరిరావు, డైరెక్టర్లు రంగారావు, యశోధర, వైస్ ప్రిన్సిపల్ రూప బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విజ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్ దేదీప్య హైస్కూల్ ప్రిన్సిపల్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

- భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:



దేదీప్య హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి

ఆలేరు, న్యూస్‌టుడే: విద్యారంగంలో పరిష్కారానికి నోచుకోని విద్యార్థుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని.. లేని పక్షంలో మరో ఉద్యమానికి చేపడతామని పీడీఎస్‌యూ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్ అన్నారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆలేరులో జరిగిన సభలో మాట్లాడారు. పదేళ్ల భారాస పాలనలో విద్యార్థులకు తీరని అన్యాయం జరగగా.. పది నెలల కాంగ్రెస్ పాలనలోనూ అదే పరిస్థితి దాపురించిందన్నారు. సమావేశానికి ముందు ప్రధాన రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు మామిడాల ప్రవీణ్, ఆర్.ఉదయ్, నాగరాజు, బేజాడి కుమార్, సిద్దులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ సభలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

షామీర్‌పేట చెరువును జలాశయంగా మార్చాలి

బొమ్మలరామారం, న్యూస్‌టుడే: మేడ్చల్ జిల్లా షామీర్‌పేట మండలంలోని షామీర్‌పేట చెరువును జలాశయంగా మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. బొమ్మలరామారంలో శుక్రవారం జరిగిన సీపీఎం సమావేశంలో మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు షామీర్‌పేట చెరువు అభివృద్ధిపై ఎలాంటి దృష్టి సారించలేదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి పాండు, కుమార్, ర్యాకల శ్రీశైలం, బ్రహ్మచారి, సాయిలు, రవి, వెంకటేశం, యాదయ్య, బిక్షపతి పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు ప్రారంభం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: దండుమల్కాపురం గ్రామంలో శ్రీ కంఠమహేశ్వరస్వామి-సురమాంబదేవి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి జలబిందెలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద హోమం, స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. పెద్ద గౌడ ఒరుగంటి శ్రీనివాస్‌గౌడ్, ముస్తాబుదారుల అధ్యక్షుడు మునుకుంట్ల సుధాకర్‌గౌడ్, దేవాలయ ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్, అశోక్‌గౌడ్, స్వామిగౌడ్, ముత్యాలుగౌడ్, నర్సింహగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శివకుమార్‌గౌడ్, దర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.



జలబిందెల ఊరేగింపులో పాల్గొన్న గౌడ కులస్థులు

మహిళ మృతి

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట దేవస్థానం పరిధిలోని లక్ష్మి పుష్కరిణి వద్ద శుక్రవారం సాయంత్రం ఓ మహిళ మృతి చెందడం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ అంబర్‌పేట్‌కు చెందిన కొడమటి లలిత(52), ఆమె భర్త నర్సింహారెడ్డి(66) ఐదు రోజుల క్రితం యాదగిరిగుట్టకు వచ్చి లక్ష్మి పుష్కరిణి వద్ద భిక్షాటన చేస్తూ గడుపుతున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న లలిత ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో శుక్రవారం సాయంత్రం ఆమె మృతి చెందారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: తుప్రాన్‌పేట శివారులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జడ్పీ సీఈవో శోభారాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు కూరను వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. వంట గదిని, భోజనశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో యాకుబ్‌నాయక్, ఎంపీవో అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్ ఉన్నారు.

అవార్డుకు ఎంపిక



రాజపేట, న్యూస్‌టుడే: మండలంలోని బొందుగుల జడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న **శోభారాణి** టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 20న హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో అవార్డు ప్రధానం చేయనున్నట్లు శారద ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు. శోభారాణికి ప్రశంస పత్రంతో పాటు జ్ఞాపిక అందిస్తూ శాలువాతో సత్కరించనున్నట్లు వివరించారు.

ఉపాధ్యాయులు గుణాత్మక విద్యా బోధన చేయండి: కలెక్టర్



దస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంత్ కె జెండగే

వలిగొండ, న్యూస్‌టుడే: సర్కార్ బడుల్లో బాల బాలికలకు నాణ్యమైన గుణాత్మక విద్యా బోధన చేయాలని కలెక్టర్ హనుమంత్ కె. జెండగే ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పాచిల్లలో గురువారం ఆదర్శ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. తరగతి గదుల్లో సబ్జెక్టుల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం పలు దస్త్రాలను పరిశీలించారు. తహసీల్దార్ జల కుమారి, ప్రిన్సిపల్ రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాసంగి పంటకు గోదావరి జలాలు రప్పిస్తాం: ఎమ్మెల్యే సామేల్

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: ఎండిపోయిన వాగులోకి గోదావరి జలాలు తెప్పించి రైతుల కళ్లల్లో ఆనందబాష్పాలు చూడాలన్నదే తన ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం అడ్డగూడూరు మండల పరిధి జానకిపురం శివారు బిక్కేరు వాగులో గోదావరి జలాలు ప్రవహిస్తుండటంతో చెక్‌డ్యాం సమీపంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి జలాల రాకతో బిక్కేరు వాగు పరివాహక ప్రాంతాలైన మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు, తిరుమలగిరి, నాగారం మండలాల పరిధిలోని సుమారు 30 గ్రామాలకు సాగునీరు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. యాసంగి వరి పంటకు ఉమ్మడి మోత్కూరు మండల పరిధిలోని బిక్కేరు వాగులోకి గోదారి జలాలను రప్పిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా చిన్నపడిశాల గ్రామంలో కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఎడ్లబండితో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, సింగిల్‌విండో ఛైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, నాయకులు కోట విద్యాసాగర్‌రెడ్డి, ఇటికాల చిరంజీవి, పర్రెపాటి యుగేందర్, కొమ్ము సత్యనారాయణ, పాశం సత్యనారాయణ, సమ్మయ్య, బాలెంల విద్యాసాగర్; గూడెపు పాండు, రైతులు పాల్గొన్నారు.



గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

పంటల పరిశీలన

మోటకొండూరు: మండలంలోని తేర్యాలలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ పంటలను క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు రోగాలు వచ్చినప్పుడు ఏ మందులు వాడాలో రైతులకు సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు మార్చుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏఈవోలు శివాని, సురేష్, అన్నదాతలు బొంగు పుల్లయ్య, రాజు, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

రామన్నపేట, న్యూస్‌టుడే: కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందనలు అన్నారు. వీరు పదోన్నతిపై బదిలీ అయిన సందర్భంగా మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. న్యాయవాద వృత్తి పవిత్రమైనదని పేర్కొన్నారు. ఎం.డి.మజీద్, యాపాల కృష్ణారెడ్డి, యాదగిరి, అశోక్‌కుమార్, నరేందర్‌రావు, రామదాసు, లింగయ్య, సత్తయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న వి.మాధవిలత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా, జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న డి.నాగేశ్వరరావు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది జగిత్యాల జిల్లా మెటుపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం జడ్జిలకు ఆత్మీయ వీడ్కోలు సత్కారం కార్యక్రమం నిర్వహించారు. జడ్జిలు మాధవిలత, నాగేశ్వరరావుకు బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయవాదులు, న్యాయవాదులు క్లర్కులు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాధవిలత మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల కాలంలో కేసుల పెండెన్సీ తగ్గించేందుకు కృషి చేశానన్నారు. జడ్జి నాగేశ్వరరావు మాట్లాడుతూ భువనగిరి జూనియర్ సివిల్ జడ్జిగా మూడేళ్ల కాలంలో బార్, బెంచ్‌ల సమన్వయంతో న్యాయవాదుల సహకారంతో పాత కేసుల పెండెన్సీ పరిష్కరించానని తెలిపారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షురాలు జయ, సీనియర్ న్యాయవాదులు దామోదర్‌రెడ్డి, రహీం, విజయ్ భాస్కర్‌రెడ్డి, లింగారెడ్డి, రమేష్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి మాధవిలత, చిత్రంలో జడ్జిలు నాగేశ్వరరావు, కవిత, తదితరులు

గొర్రె పిల్లలను కొరికి చంపిన వీధి కుక్కలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: పురపాలిక పరిధి లక్కారంలో వీధి కుక్కల దాడిలో ఏడు గొర్రె పిల్లలు శుక్రవారం మరణించాయి. పెంపకందారు గుండెబోయిన నరసింహ దొడ్డిలో గొర్రె పిల్లలున్నాయి. పెద్ద గొర్రెలను మేపడానికి వెళ్లి ఆయన తిరిగొచ్చి దొడ్డిలో చూడగా గొర్రె పిల్లల గొంతు తెగి చనిపోయి పడి ఉన్నాయి. వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కోతుల దాడిలో ఆయాకు తీవ్ర గాయాలు

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: కోతుల దాడిలో అంగన్‌వాడీ ఆయాకు తీవ్రగాయాలైన సంఘటన అడ్డగూడూరు మండల పరిధి కోటమర్తి నెం.1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నెం.1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా సఫియా చిన్నారులకు మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్నారు. ఒక్కసారిగా కోతులు ఎగబడి కరవడంతో ఆయాకు కాలు, వీపుపై తీవ్రగాయాలు కాగా, చిన్నారి చేతికి గాయమైంది. మెరుగైన చికిత్స నిమిత్తం ఆయాను ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎన్ఎం తెలిపారు.

అవీ ఇవీ

మానవహారం..
ఆలేరు: బకాయి పడిన ఉపకార వేతనాలు, ఫీజుల రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని శుక్రవారం ఆలేరులో ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులు మానవహారం చేపట్టారు. సంఘం నాయకులు మణికంఠ, దీపక్‌చారి, సాయికిరణ్ పాల్గొన్నారు.

వినతి.. ఆలేరు: కొల్లూరులో దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి పట్టాదార్ పాసు పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సాగులో ఉన్న రైతులు శుక్రవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు చెక్క వెంకటేశ్, కనకయ్య, ఆంజనేయులు తదితరులు ఉన్నారు

ఎన్నిక... తుర్కపల్లి: కొండాపురం గ్రామానికి చెందిన పోతరాజు జహంగీర్ సీపీఎం మండల కార్యదర్శిగా వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ మండల మహాసభలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కొక్కొండ లింగయ్య, గడ్డమీది నర్సింహులు, తలారి మాతయ్య, ఆవుల కలమ్మ, వెంకటేశం, దుర్గయ్య, నాగులు, వెంకటేశంను ఎన్నుకున్నారు.

ఎయిమ్స్‌పై పర్యవేక్షణ పెంచాలి.. బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రిపై పర్యవేక్షణ పెంచాలని స్థానిక భారాస నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎయిమ్స్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో రావడం మండలంలో తీవ్ర చర్చకు దారి తీస్తోందని వాపోయారు. పోలీసులు, ఎయిమ్స్ ప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగేష్, రవికుమార్, కాటం కుమార్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి.. తుర్కపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు విధిగా సమయ పాలన పాటించాలని మండల విద్యాధికారి వి.మాలతి సూచించారు. ఉదయం సాయంత్రం వేళలను పాటించని వారిపై చర్యలు తప్పవని శుక్రవారం ఆమె పేర్కొన్నారు. పాఠశాలలను తనిఖీలు నిర్వహిస్తామని సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవన్నారు.

ఉద్యమించాలి.. రామన్నపేట: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య కోరారు. పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రూపొందించిన కరపత్రాలను కొమ్మాయిగూడెంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం అఖిలపక్ష కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గురజాల అంజిరెడ్డి, కన్వీనర్‌గా బాలగోని గణేశ్, కో కన్వీనర్‌గా కాటమయ్యలు ఎన్నికయ్యారు.

వినతి.. రామన్నపేట: సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని కోరుతూ అఖిలపక్ష నాయకులు నల్గొండలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు, భువనగిరిలో అదనపు కలెక్టరు బెన్‌షాలోమ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మల్లారెడ్డి, పెంటయ్య, మల్లేశం, ఫజల్‌బేగ్, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

తాతానగర్‌లో నిర్మాణాల కూల్చివేత.. భువనగిరి పట్టణం: భువనగిరి పట్టణం తాతానగర్‌లో అనుమతి లేకుండా నిర్మించిన రేకుల ఇంటిని శుక్రవారం పుర అధికారులు కూల్చారు. కార్మికులు ఇంటి పరిసరాలను కూల్చివేశారు. జేసీబీతో ప్రహరీ తొలగించారు. సర్వే నంబర్ 1065లో ప్లాట్ నంబర్ 15/1లోని 216 గజాల విస్తీర్ణంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారని కమిషనర్ రామాంజులరెడ్డి తెలిపారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న పురపాలిక.. చౌటుప్పల్: వలిగొండ రోడ్డులో ప్రైవేటు పాఠశాలలకు ఎదుట కొందరు నిర్మించుకుంటున్న రోడ్డు నిర్మాణాన్ని మున్సిపాలిటీ సిబ్బంది శుక్రవారం అడ్డుకున్నారు. పురపాలికకు స్థలాన్ని అప్పగించిన తర్వాత రోడ్డు నిర్మించుకోవాలని నోటీసులు ఇచ్చామని, అయినా ఖాతరు చేయకుండా నిర్మాణం చేస్తుంటే పనులు ఆపామని పురపాలిక కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు.

కార్మికులపై వేధింపులు నియంత్రించాలి.. భువనగిరి పట్టణం: పారిశుద్ధ్య కార్మికులపై అధికారులు వేధింపులను నియంత్రించాలని పుర వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఈ మేరకు పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజుల రెడ్డికి ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. బట్టు కొండయ్య, మంజుల, శాంతమ్మ, శంకర్, నర్సింహ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత.. రామన్నపేట: తుర్కపల్లి మూసీ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను కక్కిరేణి శివారులో గురువారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.మల్లయ్య తెలిపారు.

చదువు, ఆటపాటల్లో ముందుండాలి.. భువనగిరి గ్రామీణం: ఆడపిల్లలు చదువుతో పాటు ఆట, పాటల్లో ముందుండాలని మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు నిఖిత, భార్గవి అన్నారు. బొల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రం, జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సాధికారత బృందం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ పావని, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పద్మలత, మున్ని, గోదావరి తదితరులు పాల్గొన్నారు.